
సాక్షి అనంతపురం

ఆదివారం । 3 । నవంబర్ । 2024



పంటల బీమాకు పాడె

రైతులను ఆదుకునేందుకు జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి సర్కారు పాడె కట్టింది. 8లో



కిలో టమాట రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.16, సరాసరిన రూ.23 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.4°/20.6°

జిల్లా అంతటా శనివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఉద్యోగి ఏడి'పింఛన్'!



పింఛన్ డబ్బు ఇప్పించాలని కోరుతున్న వృద్ధులు

బొమ్మనహాళ్: వృద్ధులకు పింఛన్ డబ్బు ఇవ్వకుండా ఓ సచివాలయ ఉద్యోగి ఏడిపిస్తున్నారు. వయసు పైబడిన సమయంలో ప్రభుత్వం అందించే సొమ్ముతో మందులు, నిత్యావసర సరుకులు కొందామనుకుంటే వేధిస్తున్నారని వృద్ధులు వాపోతున్నారు. వివరాలు.. బొమ్మనహాళ్ మండలం సింగానహళ్లి గ్రామంలో 15 మంది పింఛన్ లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగి రమేష్ డబ్బు ఇవ్వలేదు. గ్రామానికి చెందిన పకీరమ్మ, చాకలి రుద్రమ్మ, భాగ్యమ్మ, మారెక్క, హరిజన కెంచప్ప, హరిజన వంద్రక్క, హరిజన దానప్ప, హరిజన ఆంజినేయులు, హరిజన బిడ్డ కెంచప్పతో పాటు మరికొంతమంది వేలిముద్రలను శుక్రవారం ఉదయం తీసుకున్న రమేష్.. సాయంత్రానికి వచ్చి డబ్బు ఇస్తానని చెప్పి ఆ తర్వాత మొహం చాటేశారు. గతంలో కూడా పింఛన్ డబ్బు సక్రమంగా ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ డబ్బుతో మందులు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకుంటున్నామని తెలిపారు. అధికారులు స్పందించి పింఛన్ డబ్బు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్కేయూ తైక్వాండో జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ

అనంతపురం: ఆలిండియా యూనివర్సిటీస్ స్థాయిలో నిర్వహిస్తున్న తైక్వాండో (మెన్) పోటీలకు ఎస్కేయూ తైక్వాండో జట్టును ఎంపిక చేశారు. గురునానక్ దేవ్ యూనివర్సిటీ, అమృత్‌సర్‌లో నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు తైక్వాండో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఆది ఆంధ్రా ధీరజ్ (బీపీఈడీ, నారాయణ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్), రెడ్డి మణిదీప్ (బీఎస్సీ), వై. మోక్షిత్ రామ్ (బీఎస్సీ ఎస్ఎస్‌బీఎన్ కళాశాల) ఎంపికైన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా శనివారం ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ బి. జెస్సీ వారిని అభినందించారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



అఖిల

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బి. అఖిల జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. గత నెల 5 నుంచి 7 వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏపీ స్కూల్ గేమ్స్ అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అఖిల అద్భుత ప్రదర్శన చేసింది. దీంతో అఖిలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ మారుతీప్రసాద్ తెలిపారు. ఈనెల 26 నుంచి 30 వరకు జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అఖిల పాల్గొననుంది.

వడ్డీ జలగలు

- రాప్తాడు పంచాయతీ పరిధిలోని మైనార్టీ కాలనీలో నివాసం ఉంటున్న వెంకటనారాయణ, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు బొమ్ము అనిల్ కుమార్ (41) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటుకపెళ్లల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే అనిల్‌కుమార్ ఇటీవల వ్యాపారంలో నష్టాలు చవిచూశాడు. దీంతో పరిశ్రమ నిర్వహణ, కుటుంబ పోషణకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు చేశాడు. అప్పులకు వడ్డీల భారం పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో జీవితంపై విరక్తి చెందిన అతను బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- అనంతపురంలో జేఎన్‌టీయూకు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో లేడీ డాన్ ఉంది. ఈమె జేఎన్‌టీయూ ఉద్యోగులకు నెలకు రూ.10 వడ్డీ ప్రకారం అప్పులు ఇస్తోంది. వారి నుంచి పూచీకత్తుగా ఏటీఎంలు, ఖాళీ చెక్కులు తీసుకుంటోంది. ఉద్యోగులకు జీతం పడిన రోజే ఏటీఎంకు వెళ్లి వడ్డీ డబ్బు డ్రా చేసుకుంటోంది. ఎక్కడైనా తేడా వస్తే ఆమె అనుచరులు రుణగ్రహీతపై భౌతిక దాడులు చేస్తున్నారు. వచ్చిన జీతమంతా వడ్డీలకే సరిపోతుండటంతో ఉద్యోగుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది.



- అడ్డూ అదుపు లేకుండా దందా
- ఉద్యోగులకు అప్పు ఇచ్చి ఏటీఎం కార్డులు తమ వద్దే ఉంచుకుంటున్న వైనం
- నెల జీతం రాగానే నేరుగా డ్రా
- 'అనంత'లో నెలకు రూ.10 వడ్డీ వసూలు చేస్తున్న వారు కోకొల్లలు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న పోలీసులు

అనంతపురం: జిల్లాలో వడ్డీ వ్యాపారుల దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఇష్టానుసారంగా వడ్డీ వసూలు చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజల రక్తాన్ని పీలుస్తున్నారు. అసలును మించి వడ్డీ చెల్లించినా ఇంకా అప్పు మిగిలే ఉందంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పోలీసులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వడ్డీ వ్యాపారులు చెలరేగిపోతున్నారు.

కట్టకుంటే ఇంటిమీదికే..

జిల్లాలో రకరకాల పేర్లతో వడ్డీ వ్యాపారులు లావాదేవీలు సాగిస్తున్నారు. గతంలో ఏడాదికి ఒకసారి వడ్డీ, అసలు చొప్పున చెల్లించాలనే నిబంధన ఉండేది. అది కూడా వంద రూపాయలకు నెలకు రూ.2 వడ్డీ అంటే అబ్బో అనుకునే వాళ్లు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. వారం వడ్డీ.. రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. అంటే రూ.లక్ష అప్పుగా తీసుకుంటే వారానికి రూ.10 వేలు వడ్డీ చెల్లించాలి. ఒక వారం చెల్లించకపోతే వడ్డీపైన వడ్డీ పడుతుంది. మరో వారం దాటితే ఇంటి మీద పడి గొడవ చేయడంతో పాటు దాడులు సైతం చేస్తున్నారు. అప్పు తీసుకున్న వాళ్లు భయంతో వడ్డీల మీద వడ్డీలు చెల్లిస్తూ వీధిన పడుతున్నారు. అనంతపురం నగరంలోని పాతూరులో ఓ రిటైర్డ్ ఉద్యోగి వడ్డీ వ్యాపారి అవతారమెత్తాడు. చిన్న తరహా వర్తకులకు నెలకు రూ.10 వడ్డీతో అప్పులు ఇస్తున్నాడు. ఖాళీ చెక్కులు తీసుకోవడంతో పాటు రూ. లక్ష బాకీ ఉన్నా రూ.5 లక్షలకు కోర్టులో కేసు వేస్తానంటూ బెదిరిస్తూ ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈయనలాగే నగరంలో రాణీనగర్, వినాయక్ నగర్, బుడ్డప్ప నగర్ తదితర ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారమే వృత్తిగా ఎంతో మంది రూ.కోట్లకు పడగలెత్తారు.



ఆత్మహత్య చేసుకున్న బొమ్ము అనిల్‌కుమార్ (ఫైల్)

కొత్తకొత్తగా పీల్చేస్తున్నారు

సాధారణంగా రోజు.. వారం.. నెల.. సంవత్సరం ఇలాంటి వడ్డీలు అందరికీ తెలిసిందే. కానీ అనంతపురంలో ముఖ వడ్డీ తెరపైకి వచ్చింది. అంటే అప్పు తీసుకున్న వ్యక్తి ఎక్కడ కనిపిస్తే అక్కడ వడ్డీ చెల్లించాలి. ఒక రోజులో ఎన్ని సార్లు కనిపిస్తే అన్ని సార్లూ వడ్డీ కట్టాల్సిందే. ఒక వ్యక్తి రూ.10 వేలు అప్పు తీసుకున్నాడంటే నూటికి రూ.2 వడ్డీ చొప్పున కనిపించినప్పుడల్లా ఇచ్చుకోవాల్సిందే. ఈ కారణంగా అప్పు తీసుకున్న వ్యక్తి ముఖం చాటేయాల్సి వస్తోంది.

- రాయదుర్గం పట్టణంలో చిన్నపాటి వర్తకులకు కొందరు అప్పు ఇస్తున్నారు. వారానికి రూ.10 వడ్డీ చొప్పున వసూలు చేస్తున్నారు. రూ.లక్షకు వారానికి రూ.10 వేలు వడ్డీకే సరిపోతే అసలు తీర్చడానికి నానా కష్టాలు పడాల్సి వస్తోంది. వారం గడిచే సరికి ఠంచనుగా వచ్చి వడ్డీ తీసుకెళ్తున్నారు.
- తాడిపత్రి పట్టణంలో డైలీ కలెక్షన్ జోరుగా జరుగుతోంది. లక్ష రూపాయలు అప్పు అడిగితే రూ.30 వేలు పట్టుకుని రూ.70 వేలు ఇస్తారు. రోజూ రూ.1,000 చెల్లించాలి. ఇలా మూడు నెలల పది రోజులకు రూ.లక్ష చెల్లించాలి. గడువులోపు నగదు చెల్లించకపోతే చక్ర వడ్డీ కింద లెక్కిస్తారు.
- గ్రామీణ ప్రాంతాలకూ వడ్డీ వ్యాపారం విస్తరించింది. పట్టణాల్లో కొత్త ఇళ్లకు రుణ సదుపాయం కల్పించడం మామూలు విషయం. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల మీద సైతం రుణాలు ఇస్తున్నారు. మైక్రోఫైనాన్స్ తరహాలో రుణం ఇచ్చి ప్రతి నెలా కంతుల ప్రకారం వసూలు చేస్తున్నారు. ఒక వేళ రుణం సరైన సమయానికి చెల్లించకుంటే చక్ర వడ్డీ కింద అధిక మొత్తం చెల్లించాలి.

లైసెన్స్ తప్పనిసరి..

రాష్ట్రంలో వడ్డీ వ్యాపారం చేయాలంటే తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిన వడ్డీకే అప్పులు ఇవ్వాలి. అధిక వడ్డీలు వసూలు చేసినా, అక్రమాలకు పాల్పడినా మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. ఈ మేరకు వడ్డీ వ్యాపారుల చట్టం తెచ్చారు.

అధిక వడ్డీ వసూలు చేస్తే చర్యలు



అధికంగా వడ్డీ వసూలు చేస్తే చర్యలు తప్పవు. పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా వడ్డీ వ్యాపారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం.

–పి. జగదీష్, జిల్లా ఎస్పీ

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



అనంతపురం క్రైం: కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజరు సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని పలు డిపోల నుంచి 300 బస్సులను నడుపుతున్నట్లు వెల్లడించారు. అనంతపురం డిపో నుంచి శ్రీశైలం మల్లికార్జున క్షేత్రానికి 24 బస్సులు వెళ్తాయన్నారు. త్రిలింగ దర్శనం-1 (శ్రీశైలం, మహానంది, ఓంకారం) 8 ప్రత్యేక బస్సులు, త్రిలింగ దర్శనం-2 (బుగ్గ, యాగంటి, మహానంది) 12 బస్సులు నడుస్తాయన్నారు. అలాగే, అరుణాచలానికి 6 బస్సులు, లేపాక్షి-10 బస్సులు, ఆలూరు కోన-5, పొలతలకు 5 బస్సులతో కలిపి 70 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. గుత్తి డిపో నుంచి త్రిలింగ దర్శనం-1కి 2, త్రిలింగ దర్శనం-2కి 4 బస్సులు నడుపుతామన్నారు. గుంతకల్లు నుంచి శ్రీశైలం క్షేత్రానికి 12 బస్సులు, త్రిలింగ దర్శనం-1కి 4, త్రిలింగదర్శనం-2కి 8, అరుణాచలం 2 బస్సులతో కలిపి 26 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కళ్యాణదుర్గం నుంచి శ్రీశైలానికి 24, త్రిలింగదర్శనం-1కి 4, త్రిలింగ దర్శనం-2కి 8, అరుణాచలం 2 బస్సులతో కలిపి 38, రాయదుర్గం నుంచి శ్రీశైలం-30, త్రిలింగదర్శనం-1కి 4, త్రిలింగదర్శనం-2కి 10, అరుణాచలం 4 బస్సులతో కలిపి 48, తాడిపత్రి నుంచి శ్రీశైలం-30, త్రిలింగ దర్శనం-1కి 8, త్రిలింగ దర్శనం-2కి 12, అరుణాచలం-6, ఆలూరు కోన-2, పొలతలకు 10 బస్సులతో కలిపి 86 బస్సులు, ఉరవకొండ నుంచి శ్రీశైలం క్షేత్రానికి 12 బస్సులు, త్రిలింగదర్శనం-1కు 4, త్రిలింగదర్శనం-2కు 8, అరుణాచలం-2 బస్సులతో కలిపి మొత్తం 26 బస్సులు నడుస్తాయన్నారు. 50 మంది కలిసి వెళ్లాలనుకుంటే ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రిజర్వేషన్లు ప్రారంభమైనట్లు వెల్లడించారు.




అనంతపురంలో దీపాల వెలుగుల్లో క్రైస్తవుల సమాధుల తోట

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ

అనంతపురం కల్చరల్: జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి సమాధుల పండుగ ఘనంగా జరిగింది. అనంతపురంలో జేఎన్‌టీయూ రోడ్డు సమీపంలోని సమాధుల తోటలో ప్రార్థనా మందిరాల ప్రతినిధులు, క్రైస్తవ బోధకులు సమాధులను శుభ్రం చేశారు. దీపాలతో అలంకరించి ఆరాధించారు. మేరీ మాత సంఘ పెద్దలు ప్రకాష్‌బాబు, సీఎస్ఐ చర్చి పాస్టర్ బెన్‌హర్ సామూహిక ప్రార్థనలు చేయించారు. బైబిల్‌లోని పరిశుద్ధాత్మల పండుగ విశేషాలను వివరించారు. ప్రభువు రాక కోసం ఎదురు చూసే ప్రతి ఒక్కరూ నవంబరు 2న వేడుకలు జరుపుకుంటారన్నారు. పెద్దల ఆత్మ శాంతితో వారి దివ్యమైన ఆశీస్సులు అందరిపైన ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సెక్రటరీ జాన్ సుధీర్, దేవరాజ్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

తప్పిదాలుంటే 'సప్తగిరి'పై చర్యలు

- బాధితులకు మెరుగైన వైద్య సేవలు : కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్/ శింగనమల: శింగనమల మండలం లోలూరు గ్రామపంచాయతీ పరిధిలోని సప్తగిరి క్యాంఫర్ (కర్పూరం) ఫ్యాక్టరీ రియాక్టర్‌లో జరిగిన ప్రమాదంలో కార్మికులు అస్వస్థతకు గురవడానికి భద్రతా ప్రమాణాల్లో లోపాలే కారణమని తేలితే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అస్వస్థతకు గురై అనంతపురంలోని సవీర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు నాగేంద్రప్రసాద్, కృష్ణ, లక్ష్మీనారాయణ, సారయ్య, హరినాథ్‌బాబును కలెక్టర్ శనివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆరోగ్య పరిస్థితిపై ఉదయం పది గంటలకు, సాయంత్రం 4.30 గంటలకు కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేస్తుండాలన్నారు. వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని, ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా శింగనమల తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం ఫ్యాక్టరీలోని రియాక్టర్‌లో వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో కార్బన్ మోనాక్సైడ్ విడుదలైందని, దీంతో కార్మికులు అస్వస్థతకు గురైనట్లు చెప్పారు. వీరిలో ఒకరు ఆ రోజు మధ్యాహ్నమే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారన్నారు. మిగిలిన ఐదుగురికి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. బాధితుల కుటుంబాల్లో నెలకొన్న సందేహాలను వైద్యుల ద్వారా నివృత్తి చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 64 పరిశ్రమలు ఉన్నాయని, ఈ ఏడాది పలు దఫాలుగా జిల్లా భద్రతా కమిటీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారని తెలిపారు. ఆ సమయంలో సప్తగిరి క్యాంఫర్ ఫ్యాక్టరీలో ఎటువంటి సమస్యలూ లేవని నివేదికలో పేర్కొన్నారన్నారు. అయితే ప్రస్తుతం తహసీల్దార్ నివేదిక ప్రకారం రియాక్టర్‌లో దిగి పని చేయాలంటే సేఫ్టీ ఆఫీసర్ అనుమతి తీసుకుని చేయాల్సి ఉందన్నారు. వెల్డింగ్ చేసే సమయంలో ఉత్పాదకమైన పరికరాలు ఎవరు పర్యవేక్షించారు, జాగ్రత్తలు పాటించారా లేదా అని బాధితులతో వాంగ్మూలం తీసుకున్నామని పేర్కొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఫ్యాక్టరీ పరిశీలన

సప్తగిరి క్యాంఫర్ ఫ్యాక్టరీని కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆర్డీఓ వసంత్‌బాబు, ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య, తహసీల్దార్ బ్రహ్మయ్య, పరిశ్రమల అధికారులు సందర్శించారు. ప్రమాదం జరిగిన రియాక్టర్‌ను పరిశీలించారు. నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీఓ తెలిపారు.

లింగ నిర్ధారణ తీవ్ర నేరం

అనంతపురం అర్బన్: ''గర్భస్థ పిండ లింగ నిర్ధారణ తీవ్ర నేరం. జిల్లావ్యాప్తంగా స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయండి. ఎక్కడైనా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నట్లు గుర్తిస్తే కేసు నమోదు చేయండి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం (సీపీపీఎన్‌డీటీ యాక్ట్) అమలుపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లు చట్టబద్ధంగా నిర్వహించేలా చూడాలన్నారు. కడుపులోని బిడ్డ ఎదుగుదల తెలుసుకోవడానికే స్కానింగ్ తప్ప, ఆడా, మగా అనే విషయం తెలుసుకోవడానికి కాదనే విషయాన్ని గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. స్కానింగ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సినిమా హాళ్లు, జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ వి.సుజాత, అదనపు న్యాయమూర్తి శోభారాణి, డీఎస్పీ మహబూబ్‌బాషా, ఆర్‌డీటీ హెల్త్ డైరెక్టర్ దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

'అపార్'పై దృష్టి సారించాలి

- ప్రాథమిక విద్య ఆర్జేడీ శామ్యూల్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులకు సంబంధించి ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదుపై మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రాథమిక విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) శామ్యూల్ ఆదేశించారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆర్జేడీ స్థానిక డీఈఓ కార్యాలయం నుంచి ఎంఈఓలు, హెచ్ఎంలతో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ పేరిట కేంద్ర ప్రభుత్వం జీవితకాల గుర్తింపు కార్డును ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. రాయలసీమ జిల్లాలు వెనుకబడి ఉన్నాయన్నారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా పర్యటనకు వచ్చానన్నారు. అపార్ ఐడీతో నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట పడుతుందన్నారు. చిన్నచిన్న లోపాలను అధిగమించి ప్రతి పాఠశాల వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఎఫ్ఏ-1 మార్కుల నమోదులో అలసత్వం ఉండకూడదన్నారు. వందశాతం పూర్తి చేయాలన్నారు. అలాగే ఈ నెల 4 నుంచి ప్రారంభమయ్యే ఎఫ్ఏ-2 పరీక్షల మార్కుల నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్జేడీతో పాటు డీఈఓ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.



వెబెక్స్‌లో మాట్లాడుతున్న ప్రాథమిక విద్య ఆర్జేడీ శామ్యూల్

రేపటి నుంచి 'లీడర్‌షిప్', 'ఎఫ్ఎల్ఎన్' శిక్షణ

- వేర్వేరు ప్రాంతాల్లో కార్యక్రమాలు
- నాలుగు జిల్లాల నుంచి హాజరుకానున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: 'లీడర్‌షిప్', 'ఎఫ్ఎల్ఎన్' అంశాలపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు ఈనెల 4 నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. అనంతపురం రూరల్ మండలం బళ్లారి రోడ్డులోని సీఆర్ఐటీ కళాశాలలో 'లీడర్ షిప్', బుక్కరాయసముద్రంలో 'ఎఫ్ఎల్ఎన్' శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సమగ్రశిక్ష అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల నిర్వహణకు సంబంధించి కలిగి ఉండాల్సిన నాయకత్వ లక్షణాలపై ఎంపిక చేసిన మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు), ప్రధానోపాధ్యాయులు, డైట్ కళాశాల అధ్యాపకులకు 'లీడర్ షిప్'పై శిక్షణ ఇవ్వనున్నారు. పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో సాగే ఈ శిక్షణకు అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల నుంచి వందమంది చొప్పున మొత్తం 300 మంది హాజరుకానున్నారు. తొలివిడత శిక్షణ ఆరు రోజుల పాటు ఈనెల 9 వరకు కొనసాగనుంది.

'ఎఫ్ఎల్ఎన్' శిక్షణకు రెండు జిల్లాల నుంచి...

ప్రాథమిక పాఠశాలల్లో 1,2 తరగతులు బోధించే టీచర్లకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ బుక్కరాయసముద్రం సమీపంలోని విజయభారతి డీఎడ్ కళాశాల వేదికగా ఇవ్వనున్నారు. తొలివిడత శిక్షణ గత నెల 21 నుంచి 26 వరకు సాగింది. ప్రస్తుతం రెండోవిడత శిక్షణ 4 నుంచి ప్రారంభం కానుంది. జిల్లా నుంచి 125 మంది, కర్నూలు జిల్లా నుంచి 125 మంది కలిపి మొత్తం 250 మంది హాజరుకానున్నారు. రెండు శిక్షణలకు ఎంపిక చేసిన ప్రతి ఒక్కరూ హాజరుకావాల్సిందేనని, ఎవరికీ మినహాయింపు ఉండదని సమగ్ర శిక్ష అధికారులు స్పష్టం చేశారు. గైర్హాజరయ్యే వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు.

పంటల బీమాకు పాడె

- కర్షకులపై కరుణ చూపని 'కూటమి' సర్కారు
- బీమా ప్రీమియం రైతులే కట్టాలని స్పష్టీకరణ
- వ్యవసాయ, ఉద్యాన రైతులకు బీమా ఇచ్చిన గత ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా రైతులకు ఏకంగా రూ.1,883 కోట్ల బీమా పరిహారం
- ఉచిత బీమాతో ఏటా రైతులకు రూ.100 కోట్ల ప్రీమియం మిగులు
- నేడు పరిస్థితులు తలకిందులు

ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి సర్కారు పాడె కట్టింది. కర్షకులపై ఏమాత్రమూ కనికరం చూపలేకపోయింది. పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లింపు భారం రైతులపై మోపింది.



అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ రంగంపై కూటమి సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇతోధిక సాయమందిస్తూ రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరిస్తోంది. వ్యవసాయాన్ని భారంగా మారుస్తోంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ పాలనలో ఉచిత పంటల బీమా పథకం ప్రవేశపెట్టారు. పంటలు సాగు చేసినట్లు ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు పంటల బీమా పథకాన్ని వర్తింపజేశారు. రైతులు ప్రీమియం చెల్లించడానికి బ్యాంకులు, మీ-సేవ కేంద్రాలు, సీఎస్‌సీ, వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా చేశారు. రైతుల తరఫున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించింది. వ్యవసాయ పంటలతో పాటు తొలిసారిగా ఉద్యాన పంటలకు సైతం బీమా పరిహారం ఇచ్చారు. పంటల బీమా చరిత్రలో ఎపుడూ లేని విధంగా మిరప రైతులకు ఎకరాకు రూ.60 వేలు, పత్తి రైతులకు ఎకరాకు రూ.30 వేలు, కంది రైతులకు ఎకరాకు రూ.15 వేలు ప్రకారం...ఇలా రైతుల ఊహకు అందని విధంగా పరిహారం ఇవ్వడం విశేషం. అలా గడిచిన ఐదేళ్లలో ఉమ్మడి జిల్లా పరిధిలో 14.20 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లోకి రూ.1,883 కోట్ల వరకు బీమా పరిహారం నేరుగా జమ చేశారు. ఏటా ప్రీమియం రూపంలో రూ.100 కోట్ల వరకు రైతులకు మిగులుబాటు అయ్యేలా చేశారు. ఏటా క్రమం తప్పకుండా జూన్, జూలైలోనే రైతులకు పరిహారం విడుదల చేశారు. 2023 ఖరీఫ్‌కు సంబంధించి 2024 జూన్ లేదా జూలైలో పరిహారం విడుదల కావాల్సి ఉన్నా... ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు దాని గురించి పట్టించుకోవడం లేదు. దీంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది.

పాత పద్ధతిలోనే పంటల బీమా

2014-19 మధ్య అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన పాత పంటల బీమా పథకాన్ని ఇపుడు కూటమి సర్కారు అమలులోకి తేవడం విశేషం. ఖరీఫ్‌లో ఉచిత బీమా పథకాన్ని కొనసాగించిన కూటమి... ఈ అక్టోబర్‌లో ప్రారంభమైన రబీ నుంచి పాత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించింది. అంటే పంటల బీమా పథకాలు వర్తించాలంటే ఇక నుంచి రైతులు నోటిఫై చేసిన వ్యవసాయ పంటలకు 1.5 శాతం, ఉద్యాన పంటలకు 5 శాతం మేర ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పంటలను బట్టి ఎకారకు రూ.788 నుంచి రూ.4 వేల వరకు సమర్పించుకోవాలి. పంట రుణాలు తీసుకునే సమయంలో బ్యాంకులే ప్రీమియం కట్టించుకుంటాయి. రుణాలు తీసుకోని రైతులు మీ-సేవ, సీఎస్‌సీలు, లేదా బీమా పోర్టల్‌లో చెల్లించాల్సి ఉంటుంది. దీని కోసం రైతులకు తిప్పలు తప్పేలా కనిపించడం లేదు. నిబంధనల మేరకు బీమా కింద పరిహారం వస్తుందనే ఆశలు కూడా సన్నగిల్లుతున్నాయి. ఎందుకంటే గతంలో చంద్రబాబు ప్రభుత్వం కట్టించుకున్న ప్రీమియం, ఇచ్చిన బీమా పరిహారం బేరీజు వేస్తే... తీవ్ర అన్యాయం జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. గతంలో చంద్రబాబు ఐదేళ్ల హయాంలో రూ.325.91 కోట్లు ప్రీమియం రూపంలో రైతుల నుంచి కట్టించుకున్నారు. పరిహారం మాత్రం రూ.714.07 కోట్లు ఇచ్చారు. ఇందులో ప్రీమియం పక్కనపెడితే వాస్తవంగా రైతులకు దక్కింది కేవలం రూ.388 కోట్లు కావడం గమనార్హం. కనీసం ఇప్పటి నుంచైనా పంటల బీమా పథకం పక్కాగా అమలు చేసి నిబంధనల మేరకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

2014-18 మధ్య టీడీపీ పాలనలో పంటల బీమా పరిహారం

సంవత్సరం	కట్టిన ప్రీమియం (రూ.కోట్లలో...)	వచ్చిన పరిహారం (రూ.కోట్లలో...)	రైతులసంఖ్య
2014-15	14.09	25.61	47,627
2015-16	115.06	109.66	1,85,194
2016-17	44.64	419.10	5,07,658
2017-18	72.10	159.70	3,10,115
2018-19	80.02	--	--
మొత్తం	రూ.325.91 కోట్లు	రూ.714.07 కోట్లు	10,50,594

జగన్ హయాంలో పంటల బీమా..

సంవత్సరం	లబ్ధిపొందిన రైతుల సంఖ్య	వచ్చిన పరిహారం (రూ.కోట్లలో)
2019-20	4,52,074	362.14 కోట్లు
2020-21	2,46,469	266.04
2021-22	4,04,462	855.53
2022-23	3,17,567	369.09
మొత్తం	14,20,572 మంది	1,882.80 కోట్లు

క్లుప్తంగా

ఉన్నతస్థానాలకు చేరుకోవాలి



హోంగార్డు పిల్లలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన హోంగార్డుల పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి 50 మంది పోలీసు పిల్లలకు రూ.2.17 లక్షల విలువ చేసే మెరిట్ స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. డీగ్రీ, బీటెక్, ఎంసీఏ తదితర చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేల నుండి రూ.10 వేల వరకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు.

ఉత్తమ సేవకు ప్రశంసలు

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులు, సిబ్బంది, డాక్టర్లు, టీచర్లలకు ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా అనంతపురంలో ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించిన విషయం విదితమే.

రైఫిల్ షూటింగ్‌లో 'అనంత' సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న డీఈఓ ప్రసాద్ బాబు, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ సుగుణమ్మ

అనంతపురం: రాజమండ్రిలో జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. డిసెంబర్ 24న భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. అండర్-14 గర్ల్స్ పిస్టల్ విభాగంలో ధాత్రి శివాని, ఓపెన్ సైట్ రైఫిల్ బాయ్స్ విభాగంలో దీక్షన్‌సాయి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. అండర్ -17 గర్ల్స్ విభాగంలో గురు ప్రవల్లిక, అండర్-19 గర్ల్స్ విభాగంలో మల్లికాబాయి, అండర్-19 బాయ్స్ విభాగంలో అఖిల్ రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీరిని డీఈఓ ప్రసాద్‌బాబు, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ సుగుణమ్మ, వేణుగోపాల్ అభినందించారు.

నిష్టతో మండల దీక్ష పూర్తి చేయాలి



మాలను ధరింపజేస్తున్న వేద పండితులు

గుంతకల్లు రూరల్: మాలధారులు నియమనిష్టతో మండల దీక్ష పూర్తి చేయాలని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం వేద పండితులు సూచించారు. శనివారం ఆలయంలో హనుమద్ వ్రతం మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. వేకువజామునే ఆలయానికి చేరుకున్న వందలాది మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి దీక్షా దుస్తులు ధరించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ముఖమండపంలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితులు, అర్చకులు దీక్షా పరులకు మాలను ధరింపజేశారు.

పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విష్ణువర్ధన్



అనంతపురం: జేఎన్‌టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జేఎన్‌టీయూ (ఏ)లో ఈసీఈ విభాగం ప్రొఫెసర్‌గా ఉన్న డి.విష్ణువర్ధన్ నియమితులయ్యారు. పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతిని జేఎన్‌టీయూ అనంతపురానికి బదిలీ చేశారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా ఉన్న ప్రొఫెసర్ సురేష్‌బాబుకు అదనంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డికి స్పాన్సర్డ్ రీసెర్చ్ డైరెక్టర్‌గా నియమించారు. ప్రొఫెసర్ పద్మసువర్ణను ఐక్యూఏసీ డైరెక్టర్‌గా నియామకం చేశారు.

పదోన్నతుల ప్రక్రియలో అసంబద్ధాలను తొలగించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీ స్కూళ్లలో పని చేస్తున్న టీచర్ల పదోన్నతులకు సంబంధించి సీనియార్టీ జాబితా, ఖాళీల వివరాల్లో నెలకొన్న అసంబద్ధాలను తొలగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్ ఆదినారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ అనంతపురం కార్పొరేషన్, మునిసిపాలిటీలకు సంబంధించిన సినీయార్టీ జాబితాలోని పొరబాట్లపై ఇప్పటికే ఫిర్యాదులు చేశామని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో మునిసిపల్ ఆర్డీ ఆధ్వర్యంలో పదోన్నతులు చేపట్టారని గుర్తు చేశారు. తర్వాత ఏర్పడిన ఖాళీలను రోస్టర్‌ను అనుసరించి భర్తీ చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారు, పక్క జిల్లాలకు బదిలీ అయిన టీచర్ల పేర్లు సీనియార్టీ జాబితాలో ఉన్నాయని, వాటన్నింటినీ తొలగించి జాబితా తయారు చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓ కార్యాలయ అధికారులను కలిసిన వారిలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి ఎస్. సూర్యుడు, నాయకులు అజయ్‌కుమార్, సుధాకర్, మల్లికార్జున, ప్రభాకర్, సురేష్‌కుమార్, రాజన్న, రమేష్, రామకృష్ణ, నరసింహులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతుడు అంజి (ఫైల్)

ఉరవకొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ పట్టణానికి చెందిన హమాలీ కేశవుడు కుమారుడు అంజి (23)తో పాటు వారి స్నేహితులు నరసింహ, సాయి శనివారం ద్విచక్రవాహనంపై అనంతపురం బయల్దేరారు. రాములమ్మ గుడి సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొనడంతో అంజి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు స్నేహితులూ గాయపడటంతో వారిని 108వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిద్దరినీ అక్కడి నుంచి అనంతపురం పంపించారు. ఏఎస్ఐ శ్రీశైలం కేసు నమోదు చేసి, అంజి మృతుదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దుతాం



జెండా ఊపి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్

విడపనకల్లు: జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం విడపనకల్లు మండలంలోని ఆర్.కొట్టాల - గడేకల్లు మార్గంలో గుంతలు లేని రోడ్డు నెట్‌వర్క్ కార్యక్రమానికి కలెక్టర్ భూమి పూజ చేసి లాంఛనంగా పనులు ప్రారంభించారు. ఎనిమిది నియోజకవర్గాల్లోనూ శాసనభ్యులు, అధికారులు పాల్గొని గుంతలు లేని రహదారుల క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం 68 ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులకుగాను మొదటి విడత కింద రు.19.7 కోట్లు మంజూరైందన్నారు. జనవరి 15లోపు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హరిప్రసాద్, ఈఈ రాజగోపాల్, మండల ప్రత్యేకాధికారి వెంకటస్వామి, తహసీల్దార్ సునీతాబాయి, ఎంపీడీఓ షకీలాబేగం, సర్పంచులు తిప్పారెడ్డి, చంద్రశేఖర్, తిమ్మరాజు, జనార్దననాయుడు, జయసింహ, ఆశాలత, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అండర్-16 ఆంధ్రా జట్టుకు ముగ్గురు ఎంపిక



ఆర్. సాత్విక్



జి.నవదీప్



వరుణ్ సాయి నాయుడు

అనంతపురం: అండర్-16 ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ముగ్గురు క్రికెటర్లు ఆర్.సాత్విక్, జి. నవదీప్, వరుణ్ సాయి నాయుడు ఎంపికయ్యారు. అనంతపురానికి చెందిన ఆర్.సాత్విక్ కుడి చేతి ఓపెనర్ బ్యాట్స్‌మెన్, కుడి చేతి లెగ్ స్పిన్నర్. మంచి ఆల్‌రౌండర్. అంతర్ జిల్లా మ్యాచ్‌ల్లో 269 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ ఉంది. 9 వికెట్లు తీశాడు. అనంతపురానికి చెందిన వరుణ్ సాయి నాయుడు కుడి చేతి లెగ్‌స్పిన్నర్, కుడి చేతి బ్యాట్స్‌మెన్. అంతర్ జిల్లా టోర్నీలో ఏకంగా 20 వికెట్లు తీశాడు. టీవీ చంద్రమోహన్‌రెడ్డి కోచ్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామానికి చెందిన జి.నవదీప్ కుడి చేతి మీడియం పేసర్, లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్. అంతర్ జిల్లా మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసిన అనుభవం ఉంది. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో ఈ నెల మూడో తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే టోర్నీలో వీరు పాల్గొంటారు. బీసీసీఐ లెవెల్-1 కోచ్ అయిన కె.నరేష్ అండర్-16 ఏపీ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యాడు.

ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. శనివారం అనంతపురంలోని కళ్యాణదుర్గం బైపాస్‌రోడ్డులోని రజాక్ ఫంక్షన్‌హాల్‌లో నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. అన్ని స్థానాలకూ పోటీ నెలకొనడంతో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడుగా చింతా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా రమేష్‌రంగయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గంగాధర్, సీకే రవి, కార్యదర్శులుగా అమర్‌నాథ్‌రెడ్డి, ముజీత్‌ఖాన్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఇతరనాయకుల సన్మానించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసులు పటిష్టబందోబస్తు నిర్వహించారు.

రెచ్చిపోతున్న ఇసుకాసురులు

- రోజూ వందలాది టిప్పర్లలో ఇసుక అక్రమ రవాణా



పి.కొండాపురం రైల్వేగేటు సమీపంలోని రోడ్డులో ఇరుక్కుపోయిన ఇసుక టిప్పరు

పామిడి: గుంతకల్లు నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండదండలతో పామిడి ప్రాంతంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. కొండూరు రోడ్డులోని పెన్నానదిలో హిటాచీతో అక్రమంగా ఇసుకను తవ్వేస్తున్నారు. ఇసుక దందా నిరాటంకంగా సాగేందుకు రౌడీమూకను పెంచి పోషిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా రోజూ వందలాది టిప్పర్లలో ఇసుకను గుంతకల్లు, అనంతపురం తదితర ప్రాంతాలకు సరఫరా చేసి అమ్ముకుంటున్నారు. శనివారం గుంతకల్లు వైపు ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ కొండాపురం రైల్వేగేటు వద్ద రోడ్డులో ఇరుక్కుపోయింది. గంటల పాటు టిప్పరు అక్కడ ఉన్నా ఏ అధికారీ తొంగిచూడకపోవడం గమనార్హం. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడుతూ పోతే భవిష్యత్తులో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదముందని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం సెంట్రల్: డ్రిప్, స్ప్రింక్లర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. ఇక నుంచి స్మార్ట్‌ఫోన్ ద్వారా నచ్చిన కంపెనీ డ్రిప్, స్ప్రింక్లర్లను ఎంపిక చేసుకుని, రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. శనివారం ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో డ్రిప్ పరికరాలు పొలంలో అమర్చు నూతన ఫిట్టర్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2,648 మంది రైతులకు గాను 3,144 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ దిలీప్‌కుమార్, అగ్రానమిస్ట్ రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్‌స్కూల్ కరస్పాండెంట్‌పై దాడి



గాయపడిన బాబయ్య

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న సూర్య స్కూల్ కరస్పాండెంట్ దూదేకుల బాబయ్యపై శనివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. దాదాపు 20 మంది వ్యక్తులు స్కూల్ దగ్గరకు వచ్చి సర్టిఫికెట్స్ ఎప్పుడు ఇస్తావంటూ కరస్పాండెంట్‌పై దాడికి తెగబడ్డారు. కంప్యూటర్ తలపై కొట్టి గాయపరిచారు. కార్యాలయంలోని ఫర్నీచర్‌నూ ధ్వంసం చేశారు. స్థానికులు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు పారిపోయారు. అనంతరం కరస్పాండెంట్‌ను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. బాధితుడిని వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి రమేష్‌రెడ్డి ఆస్పత్రిలో పరామర్శించారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

డి.హీరేహాళ్(రాయదుర్గం): కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం వెరసి నిండు ప్రాణం గాల్లో కలిసింది. శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ ఏర్పాటుకు తవ్విన మట్టి ఓ యువకుడి మరణానికి కారణమైంది. వివరాలిలా ఉన్నాయి. డి.హీరేహాళ్ మండలం సిద్దాపురం తండాకు చెందిన మూర్తినాయక్, శివకుమార్‌నాయక్(24)లు శుక్రవారం బట్టలు కొనేందుకు కర్ణాటక రాష్ట్రం బళ్లారికి వెళ్లారు. ద్విచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి చేరుకుంటుండగా సిద్దాపురం సమీపాన శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ ఏర్పాటు కోసం తవ్వి రోడ్డుపై వేసిన మట్టి కుప్పను తప్పించే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డారు. వెనుక కూర్చున్న శివకుమార్‌నాయక్ తలకు బలమైన గాయం తగిలింది. ద్విచక్రవాహనం నడుపుతున్న మూర్తినాయక్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. శివకుమార్‌నాయక్‌ను బళ్లారిలోని విమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి పారుబాయ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

బైకుల దొంగ అరెస్ట్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎస్.శేఖర్

రాప్తాడురూరల్: ఇళ్ల, షాపుల ముందు పార్క్ చేసిన బైకులను ఎత్తుకెళ్తున్న దొంగ ఆట కట్టించారు అనంతపురం రూరల్ పోలీసులు. బైకులను ఎత్తుకెళ్తున్న దొంగను శనివారం అరెస్ట్ చేశారు. వివరాలను రూరల్ పీఎస్ సీఐ ఎస్.శేఖర్ వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కేఎస్ పాళ్యం గ్రామానికి చెందిన దేవరకొండ వేణు అలియాస్ ఎరుకల వేణు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. విలాసాలకు అలవాటు పడ్డ వేణుకు కూలిడబ్బులు ఏమాత్రం సరిపోవడం లేదు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సులభంగా డబ్బులు సంపాదించవచ్చని భావించాడు. ఈ క్రమంలో తండ్రితో కలిసి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుపడడంతో కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 2022లో ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద వేణుతో పాటు మరో ముగ్గురు కలిసి ఒక ప్రేమజంటను బెదిరించి వారివద్ద ఉన్న డబ్బు, బంగారం, మొబైల్ ఫోన్లను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై ఆత్మకూరు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో జైలుకు వెళ్లొచ్చాడు. 2023లో అనంతపురం లక్ష్మీనగర్‌లో మరో ఇద్దరితో కలిసి ఒక వ్యక్తిని బెదిరించి మొబైల్ లాక్కున్నాడు. ఈ ఘటనపై నాల్గో పట్టణ పీఎస్‌లో కేసు నమోదై జైలుకు వెళ్లొచ్చారు. స్నేహితులతో కలిసి చేస్తున్న దొంగతనాల్లో పోలీసులకు పట్టుబడుతుండడంతో ఇకపై ఒక్కడే దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పటి నుంచి బైకులు ఎత్తుకెళ్లి వాటిని అమ్ముతూ, గుజిరికీ వేస్తూ సొమ్ము చేసుకుంటూ జల్సాలు చేస్తుండేవాడు. అనంతపురం నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్లముందు, షాపుల ఎదుట నిలబెట్టిన బైకులను చాకచక్యంగా ఎత్తుకెళ్లేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సీఐ శేఖర్ పర్యవేక్షణలో ఎస్ఐ రాంబాబు, సిబ్బంది వలపన్ని నిందితుడు దేవరకొండ వేణును శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి కేఏ17 హెచ్‌బీ3071, టీవీఎస్ ఎక్స్‌ఎల్ టీఆర్ నంబరు టీఓ624 ఏపీ2206 ఏఎస్, ఏపీ02 ఏటీ7604, ఏపీ40 ఏఏ 0057 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ జగదీష్ ప్రశంసించారు.

క్లుప్తంగా

ఉజ్వలకు డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన చేసిన జి. ఉజ్వలకు శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఎస్కేయూ కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే. అనిత పర్యవేక్షణలో 'ఫ్యాబ్రికేషన్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ పాలిమర్ మెట్రిసీస్ లోడెడ్ విత్ మెటల్ నానోపార్టికల్స్ ఫర్ డ్రగ్ డెలివరీ అప్లికేషన్స్' అనే అంశంపై ఉజ్వల పరిశోధన చేశారు. నానో కణాలను పాలిమర్ మెట్రిక్స్‌లో లోడ్ చేసి, వాటి తయారీ, లక్షణాలను విశ్లేషించారు. శరీరంలో ఔషధం ఎంత సమర్థవంతంగా విడుదల అవుతుందో పరీక్షించేందుకు ఉపయోగపడేలా ఆవిష్కరించారు. ఫార్మాసూటికల్ రంగంలో ద్రవ్యరూప ఔషధాల సరఫరాకు సహకారం అందేలా పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

ఉర్దూ అకాడమీ కంప్యూటర్ సెంటర్ మార్పు

అనంతపురం రూరల్: నగరంలోని రఘువీరా కాంప్లెక్స్‌లో ఉన్న ఏపీ ఉర్దూ అకాడమీ కంప్యూటర్ సెంటర్, ఉర్దూ లైబ్రరీని పాతూరు గాంధీ బజార్‌లోని కేఎం సైఫుల్లా కాంప్లెక్స్‌లోకి మార్చినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఏడీ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మైనార్టీ విద్యార్థులు మార్పు విషయాన్ని గమనించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లిఖితారెడ్డి ఎంపిక



ఆత్మకూరు: మండల పరిధిలోని తలుపూరు ఉన్నత పాఠశాలకు చెందిన లిఖితా రెడ్డి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. శనివారం అనంతపురంలో జరిగిన క్రీడా పోటీల్లో లిఖితా రెడ్డి లాంగ్ జంప్, 200 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచారు. దీంతో సెలెక్టర్లు ఆమెను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల పీడీ జగదీశ్వరయ్య తెలిపారు. ఈ సందర్భంగా లిఖితారెడ్డిని తలుపూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాఘవేంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలి

- నియోజకవర్గ ప్రత్యేక అధికారి లలితాబాయి




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి లలితాబాయి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులు, పల్లె పండుగ ద్వారా చేపట్టిన పనుల ప్రగతి గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీడీ అనురాధ, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ, పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.5 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, కాలువలు, ఫారం పాండ్లు, పండ్ల తోటల పెంపకం తదితర పనులు ప్రారంభించినట్లు తెలిపారు. వాటిని డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. ఉపాధి హామీలో భాగంగా అర్హులైన వారందరికీ వంద రోజులు పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీఓ సుజాత, ఈసీ భాస్కర్ తదితరులున్నారు.

నేడు సండే స్కూల్ వేడుకలు

అనంతపురం కల్చరల్: స్థానిక అరవింద నగర్‌లోని సీఎస్ఐ ప్రార్థనామందిరంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు సండే స్కూల్ వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు చర్చి ప్రతినిధులు ఓ ప్రకటనలో వెల్లడించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి వైఎస్ విమలమ్మ ముఖ్య అతిథిగా విచ్చేసి.. చిన్నారులతో కలసి వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

240 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు: మండల పరిధిలోని వేపచెర్ల ఎగువ తండా గ్రామ పరిసరాల్లోని నాటుసారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 240 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్టు ప్రయోగిస్తామని అధికారులు హెచ్చరించారు. దాడుల్లో ఎస్‌ఐ కృష్ణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శివ, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మందు'బాబా'.. మజాకా!



నగరంలో ఓ బార్ ముందు తప్ప తాగి పడిపోయిన వ్యక్తి

కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది. సీఎం చంద్రబాబు రూ.99కే చీప్ లిక్కర్ అందేలా చర్యలు తీసుకోవడంతో మందుబాబులకు ఆ కిక్కే వేరుగా ఉంటోంది. కళ్లు బైర్లు కమ్మి మత్తులో వైన్ షాపులు, బార్ల ముందే పడిపోతున్నారు. అనంతపురం నగరంలోని ఏ షాపు వద్ద, ఏ సమయంలో చూసినా ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



గుత్తి రోడ్డులో కెనాల్ పక్కన ఉన్న వైన్ షాపు ముందు పడిపోయిన మందుబాబు



కమలానగర్ ప్రధాన రోడ్డులో..

పది రోజులైనా పలుకులేదు!

- భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలు
- కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లో తీవ్ర నష్టం
- కనగానపల్లి చెరువు కట్ట తెగి కొట్టుకుపోయిన వరిమడులు
- 10 రోజులు దాటినా పరిహారం ప్రకటించని ప్రభుత్వం



కనగానపల్లి చెరువు కట్ట తెగి నీటి ప్రవాహానికి ఒరిగిపోయిన వరి మడి (ఫైల్)



ముక్తాపురం చెరువు కట్టకింద కోతకు గురైన కంది పంట (ఫైల్)

కనగానపల్లి: ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన సమయంలో వరుణుడు ముఖం చాటేయడంతో చాలా మంది రైతులు పంటలు సాగు చేయలేకపోయారు. నీటి సౌకర్యం ఉన్న కొందరు బోర్ల కింద, చెరువు ఆయకట్టులో పంటలు వేశారు. ఆరుగాలం కుటుంబంతో సహా శ్రమించి పంటలు కాపాడుకున్నారు. తీరా పంట చేతికందే సమయంలో వరుణుడు ప్రతాపం చూపాడు. దీంతో పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఆదుకోవాల్సిన పాలకులు నేటికీ పరిహారం మాటెత్తడం లేదు. అధికారులూ నివేదికలు సిద్ధం చేయలేదు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోలుకోలేని దెబ్బతీసిన వాన..

అక్టోబర్ 21వ తేదీ రాత్రి రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి భారీ వర్షం కురిసింది, ఎప్పుడు లేనంతగా కనగానపల్లి మండలంలో ఏకంగా 198 మి.మీ., రామగిరిలో 98 మి.మీ. చెన్నేకొత్తపల్లిలో 95 మి.మీ వర్ష పాతం నమోదైంది. దీంతో కనగానపల్లిలోని చెరువుకట్ట తెగిపోవటంతో పాటు పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వరద నీరు పొలాలను ముంచెత్తడంతో పంటలన్నీ దెబ్బతిన్నాయి.

పంటలన్నీ నీటి మునక..

భారీ వర్షంతో కనగానపల్లిలోని చెరువు కట్ట తెగిపోవటంతో ఆయకట్టు కింద ఉన్న 80 ఎకరాల్లోని వరిమడులు నీటి మునిగాయి. అంతేకాకుండా 30 ఎకరాల్లో పంట కొట్టుకుపోయింది. ఇక ముక్తాపురం చెరువు నిండి మరవ పారడంతో వందల ఎకరాల్లో వరి మడులు, వేరుశనగ, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దాదులూరు, కుర్లపల్లి, చంద్రాచర్ల, కోనాపురం గ్రామాల్లో కొన్ని పంటలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. రామగిరి మండలంలోని పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి ప్రాంతాల్లో కోతకోసిన పంటలు కూడా నీటిలో కొట్టుకుపోయాయి. చెన్నేకొత్తపల్లి మండలంలో హరియాన్ చెరువు, వెల్దుర్తి గ్రామాల్లో వంద ఎకరాల్లో వరిమడులు నీట మునిగాయి. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేకుండా పోయింది.

పట్టించుకోని అధికారులు..

భారీ వర్షం కురిసి పంట నష్టం జరిగి 10 రోజులు దాటినా రెవెన్యూ, వ్యవసాయాధికారులు పరిహారం గురించి ఇప్పటికీ నివేదించలేదని రైతులు వాపోతున్నారు. భారీ వర్షం కురిసిన తర్వాత రెండోరోజు కలెక్టర్ టీఎస్ చేతన్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కనగానపల్లిలో పర్యటించారు. వర్షపునీటికి తెగిన చెరువు కట్టను పరిశీలించడంతో పాటు అక్కడే దెబ్బతిన్న కొన్ని పంటలను కూడా పరిశీలించారు. అయితే చెరువు కట్ట మరమ్మతు పనులు గురించి మాట్లాడిన కలెక్టర్, ఎమ్మెల్యే... పంట నష్ట పరిహారం గురించి మాత్రం మాట్లాడలేదని రైతులు చెబుతున్నారు. గత నెలలో విజయవాడలో వరదలు వస్తే వెంటనే పరిహారాన్ని ప్రకటించారని, ఇక్కడి రైతుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదని రైతు సంఘం నాయకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



భారీ వర్షానికి ముక్తాపురం చెరువు ఒకేసారి నిండి మరవ పారడంతో పంటలు దెబ్బతిన్నాయి. ముక్తాపురం చెరువు కట్టకింద నేను సాగు చేసిన 5 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. దీంతో పాటు కూరగాయల పంటలు కూడా చాలా దెబ్బతిన్నాయి. ఇంతవరకూ ఏ ఒక్క అధికారి గానీ, ప్రజాప్రతినిధి గానీ దెబ్బతిన్న పంటలను పరిశీలించలేదు. పంట నష్ట పరిహారం గురించి కూడా మాట్లాడలేదు.

– లక్ష్మిరెడ్డి, రైతు, ముక్తాపురం గ్రామం, కనగానపల్లి మండలం

నివేదికలు పంపుతున్నాం

భారీ వర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలను స్థానిక రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది ద్వారా తీసుకొని ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. కొన్ని గ్రామాల నుంచి ఇంకా సరైన వివరాలు అందలేదు. ప్రభుత్వం నుంచి రైతులకు పంట నష్ట పరిహారం రావాలంటే కొంత ఆలస్యమవుతుంది. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూస్తాం.

– కృష్ణయ్య, ఏడీఏ, ధర్మవరం డివిజన్

వెంటనే పరిహారం అందించాలి



భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలి. కానీ రెవెన్యూ, వ్యవసాయాధికారులు ఇంతవరకు పంట నష్టం ఎంత జరిగింది అనే విషయం కూడా చెప్పటం లేదు. జిల్లా అధికారులు కనగానపల్లిలో మాత్రం పర్యటించి వెళ్లారు గానీ, పంటలు దెబ్బతిన్న రైతుల గురించి మాత్రం మాట్లాడటం లేదు. నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించకపోతే ఆందోళనలు నిర్వహిస్తాం.

– కదిరప్ప, జిల్లా రైతు సంఘం నాయకుడు, కనగానపల్లి మండలం

'ఉల్లాస్' లక్ష్యం నెరవేరాలి



'అక్షర వెలుగు' కరదీపికను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ విద్యా విధానం -2020లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) లక్ష్యం జిల్లాలో నెరవేరాలని వయోజన విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని నెహ్రూ యువకేంద్ర సమావేశ హాలులో జిల్లా వ్యాప్తంగా ఎంపీడీఓలు, డీఆర్డీఏ ఏపీఎంలకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. వయోజన విద్య శాఖ డీడీతో పాటు డీఈఓ ప్రసాద్‌బాబు, జెడ్పీ సీఈఓ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంచి లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు. 15 ఏళ్లు, అంతకంటే పైబడి ఉండి తమకు తాము చదువుకునే అవకాశం లేనివారికి సాధికారత కల్పించడం, దేశాభివృద్ధికి సహకరించేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్లు రవి, జయచంద్ర, లలిత జిల్లాస్థాయి శిక్షణలో అవగాహన కల్పించారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు మండలస్థాయిలో యానిమేటర్లకు అవగాహన కల్పించనున్నారు. అనంతరం 'అక్షర వెలుగు' కరదీపికను అధికారులు ఆవిష్కరించారు.

దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలి


- ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత

అనంతపురం మెడికల్: దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. డెంగీ, మలేరియా కేసులపై ఆరా తీశారు. కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎలీసా రీడర్ ద్వారా నిర్ధారిస్తేనే డెంగీగా పరిగణించాలన్నారు. ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మలేరియా అధికారి ఓబులు మాట్లాడుతూ కేసులు నమోదైన ప్రాంతాల్లో మందులు స్ప్రే చేయిస్తున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ, మునిసిపాలిటీలు, పంచాయతీలను సమన్వయం చేసుకుని ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీలత, శ్రీ సత్యసాయి జిల్లా సహాయ మలేరియా అధికారి లక్ష్మా నాయక్, ఎంపీహెచ్ఈఓ గిరిధర్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం మలేరియా విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన సుధాకర్‌ను సిబ్బంది అభినందించారు.

'కార్తీక' పూజలు ప్రారంభం



ఆకాశదీపాన్ని వెలిగించిన దృశ్యం

అనంతపురం కల్చరల్: పవిత్ర కార్తీక మాసం తొలిరోజు పూజలను శనివారం ఆకాశదీపంతో ప్రారంభించారు. నెలరోజుల పాటు వైభవంగా సాగే వేడుకలకు స్థానిక మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో భక్తుల శివనామస్మరణ నడుమ వేదపండితులు శ్రీకారం చుట్టారు. ప్రదోష కాలంలో ఆకాశదీపాన్ని వెలిగించారు. ఆలయమంతా దీపాలు వెలిగించి.. ధ్వజ స్తంభాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు నరసింహ శర్మ, ఇతర పండితులు పూజోత్సవాలను ఆరంభించి కార్తీక మాస విశిష్టతను తెలియజేశారు. ఆలయ ఈవో సాకే రమేష్‌బాబు మాట్లాడుతూ వచ్చేనెల ఒకటి వరకు క్రమం తప్పకుండా ప్రతి సోమవారం, పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. అంతకు ముందు శ్రీకాశీవిశ్వేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కిషోర్‌శర్మ, హర్షశర్మ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేటి నుంచి భాగవత సప్తాహం

అనంతపురం కల్చరల్: నగరంలోని శృంగేరీ శంకర మఠం వేదికగా ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు భాగవత సప్తాహం జరగనుంది. ఈ మేరకు మఠం ప్రతినిధి సత్యప్రసాద్ వివరాలను తెలియజేశారు. బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రఖ్యాత ప్రవచన కర్త మల్లాది వెంకటరామనాథ శర్మ శ్రీమద్భాగవతంపై రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రవచనం చేస్తారు.

నేడు 'ప్రశ్న' ఉచిత ప్రదర్శన

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన దర్శకుడు తరిమెల రాజు దర్శకత్వంలో నిర్మించిన 'ప్రశ్న' లఘుచిత్రాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక నీలిమ థియేటర్‌లో ఉచితంగా ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు కేపీ రాజు, టీవీరెడ్డి తెలిపారు. ఇటీవల విజయవాడలో తెలుగు షార్ట్‌ఫిల్మ్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో 'ప్రశ్న' ఉత్తమ చిత్రంగా ఎంపికై ప్రశంసలు పొందిందన్నారు. నారీ శక్తి ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలన్న నేపథ్యంలో సాగే చిత్రాన్ని వీక్షించాలని కోరారు.

'దాడులు పెరిగిపోయాయి'

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గత ప్రభుత్వం గురించి విమర్శలు చేయడానికే సమయం సరిపోతోందన్నారు. దేశంలోనే అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతంగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో 17 మండలాలను మాత్రమే కరువు జాబితాలో ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఓ దళిత యువకుడిని తీసుకెళ్లి గుడిలో బంధించి, దేవుని ఎదుటే విచ్చలవిడిగా దాడి చేస్తే నిందితులపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. దళితులకు రక్షణ కరువైందన్నారు. ప్రభుత్వ విద్యారంగం నాశనమైపోతున్నా కూటమి పాలకులకు పట్టడం లేదని ధ్వజమెత్తారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగరంలోని మార్కెట్‌యార్డ్ వెనుక వైపు ఉన్న బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,930 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

రాప్తాడు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించబోమని రాప్తాడు సీఐ టీవీ శ్రీహర్ష హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన హంపాపురం గ్రామంలో సిబ్బందితో కలిసి నాకాబందీ నిర్వహించారు. గ్రామంలోని రౌడీషీటర్ల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే ఫ్యాక్షన్‌తో సంబంధమున్న ఇరు వర్గాల వారికి చెందిన ఇళ్లలోకూడా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రౌడీ షీటర్లు ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవన్నారు. గ్రామంలో ఎవరూ ఘర్షణలు, గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రచ్చకట్ట దగ్గర సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు.

దెబ్బతిన్న రోడ్లన్నీ బాగుచేస్తాం

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలో దెబ్బతిన్న గ్రామీణ రోడ్లన్నీ బాగు చేయిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. శనివారం ఆమె తగరకుంట రహదారిలో పండమేరు వంక వద్ద ఉన్న రోడ్డుకు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో 125 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతు చేయించేందుకు ప్రభుత్వం ప్రస్తుతానికి రూ.2.5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. వీటి ద్వారా సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'మాస్టర్ మైండ్స్'కు విద్యార్థుల ఎంపిక

అనంతపురం ఎడ్యుకేషన్: లండన్ బుక్ ఆఫ్ ప్రపంచ రికార్డులో చోటు సంపాదించేందుకు శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రైమరీ విద్యార్థులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. మాస్టర్స్ మైండ్స్ ప్రోగ్రాంకు జిల్లా నుంచి 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈనెల 6న 'గణితం 668 ఫార్ములా'లో ఈ విద్యార్థులు భాగస్వామ్యం కానున్నారని పేర్కొన్నారు. ప్రపంచ రికార్డు సాధనకు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శ్రీచైతన్య సీబీఎస్సీ పాఠశాల ప్రైమరీ కోఆర్డినేటర్లు సౌజన్య, రోజారాణి, ప్రిన్సిపాల్ కరీముల్లాను ఏజీఎం సుబ్బారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, డీన్లు ఉన్నారు.

సేవలు చిరస్మరణీయం



సీసీఎస్ సీఐ నాగమణిక దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: పదవీ విరమణ అనివార్యమే అయినా డిపార్ట్‌మెంట్‌కు చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని జిల్లా ఎస్పీ పి. జగదీష్ అన్నారు. అనంతపురం సీసీఎస్ సీఐ నాగమణిక శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా నాగమణిక దంపతులను ఎస్పీ ఘనంగా సత్కరించారు. శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇలియాజ్‌బాషా, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోండి

- రామగిరి సీఐకి వైఎస్సార్ సీపీ నాయకుల ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడి ఇంటిపై దాడికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు రామగిరి సీఐ శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గోవిందరెడ్డితో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ, టీడీపీ సానుభూతిపరులు కొందరు శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడికి ప్రయత్నించారన్నారు. తాము గొడవలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో జీవితం గడపాలని భావిస్తున్నామన్నారు. తమను రెచ్చగొట్టే విధంగా టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. మరోసారి ఇలా జరగకుండా చూడాలని వైఎస్సార్ సీపీ నాయకులు సీఐని కోరారు. సీఐని కలిసిన వారిలో శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న మెప్మా ఇన్‌చార్జ్ పీడీ విశ్వజ్యోతి

అనంతపురం కార్పొరేషన్: స్వయం సహాయక సంఘాల సభ్యులందరూ ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఇన్‌చార్జ్ పీడీ విశ్వజ్యోతి సూచించారు. అందరి వివరాలు అందులో నిక్షిప్తమైతే ప్రభుత్వ పథకాల అమలును మరింత పటిష్టం చేయవచ్చని పేర్కొన్నారు. శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మెప్మా సిబ్బంది, ఆర్పీలు తదితరులకు యాప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలకు యాప్ లాగిన్ ఇచ్చి వారి పరిధిలోని సంఘాలు, సభ్యుల సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు భవాని, ఆర్.వాసుదేవ రెడ్డి, కాటమయ్య, ఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.